టెన్షన్.. టెన్షన్..!

- యమపాశాల్లా విద్యుత్ తీగలు
- ఆందోళనలో సూర్యప్రకాష్ కాలనీ వాసులు

నెల్లూరు(బృందావనం): హై టెన్షన్ విద్యుత్ తీగలతో పొదలకూరు రోడ్డులోని సూర్యప్రకాష్‌కాలనీ వాసులు ఆందోళనతో జీవనం సాగిస్తున్నారు. ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నా, ఎవరూ పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని అంబాపురం 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి రాజేంద్రనగర్‌లోని 33 / 11 సబ్‌స్టేషన్‌కు హైటెన్షన్ లైన్ సూర్యప్రకాష్ కాలనీ మీదుగా నివాస గృహాలపై వెళ్తోంది. ఫలితంగా నిప్పు రవ్వలు ఎగిసిపడుతూ, ఇన్సులేటర్లు పగిలిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో గృహోపకరణాలు కాలిపోతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


ఇంటిపై నుంచి వెళ్తున్న తీగలు


ప్రమాదభరితంగా విద్యుత్ లైన్లు


చేతికందే ఎత్తులో తీగలు

చినుకుపడితే షాక్

చినుకుపడితే మా ఇంట్లో కరెంట్ షాక్ కొడుతోంది. కొన్నేళ్ల క్రితం మా ఇంటి ఎదురుగా ఉన్న పదేళ్ల బాలిక ఇంటి మిద్దెపై ఆడుకుంటూ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. భయంతో సొంతింటిని ఖాళీ చేసి దూరంగా బాడుగ ఇంటికి వెళ్లిపోయాం.

– సునీత

నిప్పురవ్వలు ఎగసిపడుతుంటాయి

తప్పనిసరి పరిస్థితుల్లో ఈ లైన్ వెళ్లే ఇంటి కింద బాడుగకు ఉంటున్నాం. నిప్పురవ్వలు తరచూ ఎగసిపడుతున్నాయి. వైర్లపై ఉండే ఇన్సులేటర్లు పగిలి కిందపడ్డాయి. సమస్యను అధికారులు పలుమార్లు తెలియజేశాం.

– ఆదిలక్ష్మి

తీగలను ఎప్పుడు మారుస్తారో..?

కరెంట్ తీగలతో జరిగే ప్రమాదాలతో భయపడి ఇంటిని ఖాళీ చేసి పక్కవీధిలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఎప్పుడు తీగలు తెగుతాయోనని ఆందోళనగా ఉంది.

– శాంతి

క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొడవలూరు: చంద్రశేఖరపురంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టీ విష్ణుప్రియ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 60 సీట్లు ఉండగా, 30 సీట్లు బాలికలు, 30 సీట్లు బాలురకు కేటాయించినట్లు చెప్పారు. అలాగే 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నామని చెప్పారు. 7వ తరగతిలో బాలురు 10, బాలికలు 2, 8వ తరగతిలో బాలురు 1, 9వ తరగతిలో బాలికలు 2 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు వచ్చే నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖా స్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వచ్చే నెల 30న గురుకులంలో రాత పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. వివరాలకు 90101 75322 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మనుబోలమ్మకు శఠారి బహూకరణ



మనుబోలు: మనుబోలు గ్రామ దేవత మనుబోలమ్మకు గ్రామానికి చెందిన బడుగు రవీంద్ర రూ.30 వేల విలువైన వెండి శఠగోపాన్ని ఆదివారం బహూకరించారు. అర్చకుడు ఫణీంద్రశర్మ మనుబోలమ్మకు పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శఠగోపానికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

డప్పు కళాకారులు ఐక్యంగా ఉండాలి



పొదలకూరు : జిల్లాలోని డప్పు కళాకారులు ఐక్యంగా ఉండాలని జిల్లా జానపద కళావేదిక కార్యదర్శి తల్లు సేనయ్య అన్నారు. మండలంలోని తోడేరు ఎస్సీకాలనీలోని డప్పు కళాకారులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సేనయ్య మాట్లాడుతూ వివిధ కార్యక్రమాలకు వెళ్లే డప్పు కళాకారులు గౌరవమైన వేతనాలను పొందాల్సిందిగా సూచించారు. ప్రభుత్వం నుంచి సౌకర్యాలు పొందేందుకు ఐకమత్యంగా ఉండాలన్నారు. డప్పు కళాకారులకు బీమా సౌకర్యం కల్పించాలని , 40 ఏళ్లకే పింఛన్ పొందే అర్హతను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అలుపూరు లోకేష్, పోలయ్య, ప్రసాద్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారికి పురస్కారం



కొడవలూరు: క్షయ నియంత్రణకు విశేషంగా కృషి చేసినందుకు గానూ కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం రామకృష్ణకు పురస్కారం లభించింది. పీహెచ్‌సీ పరిధిలో ఎక్కువ మంది క్షయ రోగులను గుర్తించి చికిత్స అందించడంతో నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఎం పెంచలయ్య చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం రామకృష్ణ మాట్లాడుతూ క్షయ లక్షణాలపై విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా రోగులు ప్రాథమిక దశలోనే పీహెచ్‌సీకి వచ్చేలా చేయడం జరిగిందన్నారు. తద్వారా ప్రాథమిక దశలోనే క్షయను నివారించడం జరిగిందన్నారు. క్షయ నియంత్రణలో తనకు సహకారం అందించిన వైద్య సిబ్బందికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ఆస్పత్రి వద్ద గుర్తుతెలియని బాలుడు



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధి లోని దేవసేనమ్మ ఆస్పత్రి వద్ద సుమా రు ఆరేళ్లు కలిగిన గుర్తుతెలియని బాలు డ్ని ఆదివారం రాత్రి స్థానికులు గుర్తించారు. ఇంటి నుంచి తప్పిపోయి ఆస్పత్రి వద్దకు చేరుకున్న బాలుడు ఏడుస్తుండగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వీరప్రతాప్ తన సిబ్బందితో కలిసి ఆస్పత్రి వద్దకు చేరుకుని బాలుడి నుంచి తల్లిదండ్రుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయ త్నించారు. బాలుడు వివరాలు చెప్పలేకపోవడంతో స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడి వివరాలు తెలిసిన వారు బుచ్చిరెడ్డిపాళెం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

క్రైమ్ కార్నర్

అట్రాసిటీ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిని కులంపేరుతో దూషించిన ఘటనలో నిందితుడిపై అట్రాసిటీ కేసును నవాబుపేట పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఆటోడ్రైవర్లయిన బిట్రగుంటలోని కొత్తూరుకు చెందిన కొండలరావు, కొడవలూరు మండలం బొడ్డువారిపాళేనికి చెందిన వెంకటేశ్వర్లు స్నేహితులు. రూ.రెండు లక్షల రుణాన్ని ఇప్పించాలని స్నేహితుడ్ని వెంకటేశ్వర్లు కోరారు. తనకు తెలిసిన వారి ద్వారా ఇప్పిస్తానని.. దీనికి రూ.11 వేల కమీషన్ అవుతుందని చెప్పడంతో ఆ మొత్తాన్ని కొండలరావుకు ఇచ్చారు. అందులో రూ.మూడు వేలను కొండలరావు తీసుకొని మిగిలిన మొత్తాన్ని లోన్ ఏజెంట్‌కు ఇచ్చారు. అయితే సిబిల్ స్కోర్ తక్కువగా ఉండటంతో లోన్ రాదని చెప్పారు. దీంతో తన వద్ద తీసుకున్న రూ.11 వేలను ఇవ్వాలని స్నేహితుడిపై వెంకటేశ్వర్లు ఒత్తిడి తీసుకొచ్చారు. తాను తీసుకున్న మొత్తాన్ని కొండలరావు చెల్లించి, మిగిలిన నగదును త్వరలో ఇప్పిస్తానని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని నెల్లూరు నుంచి బిట్రగుంటకు కొండలరావు ఈ నెల 14న వెళ్తుండగా, వెంకటేశ్వరపురం వద్ద వెంకటేశ్వర్లు అడ్డుకొని కులంపేరుతో దూషించి దౌర్జన్యం చేశారు. ఈ మేరకు నవాబుపేట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం



నెల్లూరు(క్రైమ్): ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని సర్వేపల్లి కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం రాత్రి గుర్తించారు. సమాచారం అందుకున్న నవాబుపేట పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆత్మకూరు బస్టాండ్ నుంచి స్టోన్‌హౌస్‌పేట వెళ్లే వంతెన కింద మృతదేహం ఉండటంతో వెలికితీయడం కష్టతరంగా మారింది. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని తాళ్లకు గాలం వేసి మృతదేహాన్ని కాలువ నుంచి వెలికితీశారు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాల కోసం చుట్టుపక్కల ఆరాతీస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 94407 96306 నంబర్‌ను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు కోరారు.

బ్రేక్ ఫెయిలై కారును ఢీకొన్న లారీ



నెల్లూరు(క్రైమ్): రేషన్ షాపునకు బియ్యాన్ని తీసుకెళ్లిన లారీ బ్రేక్ ఫెయిలవడంతో కారును ఢీకొంది. వివరాలు.. గౌతమినగర్ రెండో వీధిలో నివాసం ఉంటున్న అశోక్ ఇంటి కింది పోర్షన్లో రేషన్ షాపు ఉంది. దుకాణానికి లారీలో బియ్యం ఆదివారం వచ్చింది. లారీని ఆపే క్రమంలో బ్రేక్ ఫెయిలైంది. దీంతో వెనుక పార్క్ చేసి ఉన్న కారును వేగంగా ఢీకొంది. దీంతో కారు పాక్షికంగా దెబ్బతినగా, వెనుక ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపోయింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

అనారోగ్య సమస్యలతో వృద్ధుడి ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్) : ఆరోగ్యం ఎంతకీ కుదుటపడకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రంగనాయకులపేట గేట్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు.. చెన్నై రెడ్‌హిల్స్‌లోని తిరువళ్లూరు వార్ స్ట్రీట్‌లో రాజేంద్రన్(69), పవిత్ర రాజేంద్రన్ దంపతులు ఉంటున్నారు. వీరికి సురేష్, దయాళన్ కుమారులు. లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని రాజేంద్రన్ పోషించారు. ఇద్దరు కుమారులకు వివాహం చేశారు. కొంతకాలంగా ఫిట్స్‌తో పాటు వివిధ అనారోగ్య సమస్యలతో ఆయన బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. పనులకు వెళ్లడం మానేసి ఇంటి వద్దే ఉంటున్నారు. అప్పుడప్పుడూ దేవాలయాల సందర్శనకు వెళ్లేవారు. నెల్లూరులోని రంగనాథస్వామి దేవస్థానానికి సైతం వచ్చేవారు. ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తుండటంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో గుడికి వెళ్లొస్తానని ఇంట్లో శనివారం చెప్పి బయటకొచ్చారు. అక్కడి నుంచి నెల్లూరుకు చేరుకున్న ఆయన రంగనాయకులపేట రైల్వే గేట్ సమీపంలో కావలి వైపు వెళ్లే పట్టాలపై గూడ్స్ కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. రైల్వే లోకో పైలట్ వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు నెల్లూరు రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో లభ్యమైన ఆధార్, ఘటన స్థలంలోని సెల్‌ఫోన్ ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి కుమారులు నెల్లూరు చేరుకొని తండ్రి మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాన్ని కుమారులకు అప్పగించారు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



నెల్లూరు(అర్బన్): నవాబుపేటలోని పత్తివారి మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. హరిత జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టామని ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్యాణి తెలిపారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): పాతకక్షలను మనస్సులో పెట్టుకొని వ్యక్తిపై ముగ్గురు విచక్షణరహితంగా దాడి చేసిన ఘటన కుసుమ దళితవాడలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. కుసుమ దళితవాడకు చెందిన సెంట్రింగ్ మేస్త్రీ అనిల్‌కు అదే ప్రాంతానికి చెందిన చంద్ర, అజయ్, బాలాజీకి మధ్య పాత గొడవలున్నాయి. చంపుతామంటూ అనిల్‌ను కొంతకాలంగా వీరు బెదిరించసాగారు. ఈ క్రమంలో అనిల్ బావమరిది రాంబాబు బైక్‌పై శనివారం రాత్రి ఇంటికెళ్తుండగా, అజయ్ నానా దుర్భాషలాడారు. దీంతో ఇంటికొచ్చిన రాంబాబు జరిగిన విషయాన్ని తన బావ అనిల్‌కు తెలియజేశారు. వీరితో గొడవపెట్టుకోవద్దని బావమరిదికి ఆయన సర్దిచెప్పారు. ఈ క్రమంలో అజయ్ అతని స్నేహితులు చంద్ర, బాలాజీ.. అనిల్ ఇంటికొచ్చి గొడవకు దిగారు. అడ్డుకోబోయిన అనిల్ భార్య దేవిని తోసేశారు. అనంతరం కర్రలతో అనిల్ తలపై విచక్షణరహితంగా దాడి చేయడంతో ఆయన స్పృహ కోల్పోయారు. దీంతో దేవి పెద్దగా కేకలేయడంతో స్థానికులు రావడాన్ని గమనించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన అనిల్‌ను హుటాహుటిన చికిత్స నిమిత్తం అపోలో హాస్పిటల్లో కుటుంబసభ్యులు చేర్పించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో బెదిరించి నగదు దోపిడీ

నెల్లూరు(క్రైమ్): కత్తితో బెదిరించి నగదును దోచుకున్న రౌడీషీటర్‌పై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. గుర్రాలమడుగు సంఘానికి చెందిన విజయ్‌కుమార్ రౌడీషీటర్. అపోలో హాస్పిటల్ జంక్షన్ వద్ద హరనాథపురానికి చెందిన మధును కత్తితో శనివారం బెదిరించి రూ.500ను దోచుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ రాములునాయక్ తెలిపారు.

‘ఎస్వీఎస్’లో ఫేర్‌వెల్ డే



నెల్లూరు రూరల్: కొత్తూరు పరిధిలోని శ్రామికనగర్‌లో గల ఎస్వీఎస్ స్కూల్లో ఫేర్ వేల్ డేను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థానానికి చేరుకోవాలని పేర్కొన్నారు. శ్రీహర్ష కోచింగ్ సెంటర్ డైరెక్టర్ హరిప్రసాద్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాజు, ఇన్‌చార్జి గౌరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి


మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గాంధీగిరిజన కాలనీలోని 53 / 2 సచివాలయ పరిధిలో గల కన్వీనర్లు, గృహ సారథులతో పాటు 53, 54 డివిజన్ల పరిధిలోని ఆరు సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ 53, 54వ డివిజన్ల ఇన్‌చార్జి శంకర్‌రెడ్డి మాట్లాడారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సూచనల మేరకు సమావేశాన్ని నిర్వహించామని చెప్పారు. డివిజన్లలోని ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని సూచించారు. కార్పొరేటర్ సుజాత, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తత అవసరం



నెల్లూరు(బృందావనం): వివిధ పనులపై బయటకెళ్లినప్పుడు సీనియర్ సిటిజన్స్ పలు జాగ్రత్తలు పాటించాలని.. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా మెలగాలని నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయ రెడ్డి పేర్కొన్నారు. ఆచారివీధిలోని నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో నెలవారీ సమావేశాన్ని ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడారు. తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనంతరం మార్చిలో జన్మించిన సీనియర్ సిటిజన్స్ వెంకటేశ్వర్లు, భాస్కర్, మోహన్‌గుప్తా, నరసింహులు, వెంకటేశ్వరరావును సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌రావు, కృష్ణమూర్తి, కోశాధికారి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి


మాట్లాడుతున్న గోపీ

నెల్లూరు(బారకాసు): వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గోపీ కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఈ అంశమై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. రాష్ట్ర నేత చిన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ అధికార ప్రతినిధి మనోహర్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, వెంకటప్రసాద్, గోపీ, రమణయ్య, రామతులసి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణను అడ్డుకోవాలంటూ నిరసన



నెల్లూరు రూరల్: కొత్తూరులోని హెచ్‌కే బాబు కాలనీలో రహదారిని ఆక్రమించి నిర్మాణాలను చేపడుతున్నారని, దీన్ని అడ్డుకోవాలని స్థానికులు కోరారు. రహదారిపై నిరసనను ఆదివారం చేపట్టిన అనంతరం వారు మాట్లాడారు. ఆక్రమణల కారణంగా భవిష్యత్తులో కొత్తూరు ఎస్టీ కాలనీ, నక్కాగోపాల్‌నగర్ వాసులకు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడే పరిస్థితులు ఉన్నాయని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి వినతి



మాట్లాడుతున్న సుందరరామరాజు

నెల్లూరు (టౌన్): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆలిండియా స్టూడెంట్స్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుందరరామరాజు కోరారు. నగరంలోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఏఐఎస్బీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులను పూర్తి స్థాయిలో కల్పించాలని కోరారు. అనంతరం ఏఐఎస్బీ రాష్ట్ర నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా వెంకటసాయి చైతన్య (నెల్లూరు), ఉపాధ్యక్షుడిగా సాయికృష్ణ, (చిత్తూరు), ప్రధాన కార్యదర్శిగా జయవర్ధన్, ఆర్థిక కార్యదర్శిగా పృథ్వి, కార్యదర్శులుగా సురేంద్రబాబు, ప్రశాంత్, రాజు, తదితరులను ఎన్నుకున్నారు.

బహుజనులకు రాజ్యాధికారం రావాలి



నెల్లూరు(వేదాయపాళెం): బహుజనులకు రాజ్యాధికారం వచ్చినప్పుడే అభివృద్ధి ఫలాలు అందరికీ అందుతాయని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర నేత రామచంద్రయ్యయాదవ్ పేర్కొన్నారు. గడప గడపకూ బీసీ గళం రాష్ట్ర స్థాయి సదస్సును సంఘ యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడు లీలాకృష్ణయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి నుంచి ర్యాలీని నిర్వహించారు. అనంతరం అయ్యప్పగుడి సమీపంలోని గుర్రం బాబయ్య కల్యాణ మండపంలో గడప గడపకూ బీసీ గళానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

కార్యకర్తలు విశేష కృషి చేసి బీసీ సంక్షేమ సంఘ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం రామచంద్రయ్యయాదవ్‌ను సత్కరించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ వాకర్స్‌కు సత్కారం



నెల్లూరు రూరల్: పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పలువురు వాకర్స్‌ను జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. సభ్యులు ఎస్తేరురాణి, శేషయ్య, చంద్రశేఖర్, సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ గవర్నర్ సుధాకర్ రెడ్డి, కార్యదర్శి ఖాజామస్తాన్, సలహాదారులు రాజగోపాల్, కృష్ణయ్య, అనంతరావు, హరిసుధ, తదితరులు పాల్గొన్నారు.